దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులు అన్యాయం: సీపీఐ

విశాలాంధ్ర - సారవకోట/నరసన్నపేట: దేశంలోని దళిత, గిరిజన, మైనారిటీలపై జరుగుతున్న దాడులు అన్యాయమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నియోజక వర్గంలోని సారవకోట తహాశీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశానికి నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత కేంద్రంలో, రాష్ట్రంలో బలహీనవర్గాలపై దాడులు అధికమయ్యాయని విమర్శించారు. దేశంలో రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులను పాతర వేస్తూ, మతోన్మాద పాలన కొనసాగుతుందన్నారు. నరేంద్ర మోడీ పాలనలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రక్షణ కరువైందన్నారు. ఇటీవల భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ గవాయ్ పై సనాతనవాదే దాడికి పాల్పడిన ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని, మోడీ పాలనలో ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు రక్షణ ప్రశ్నార్ధకరమైనదని, అణగారిన వర్గాల హక్కులు హరించబడుతున్నాయన్నారు. గిరిజనుల పొట్ట కొట్టేలా, అడవి బిడ్డల హక్కులను హరించేలా అడవులను, సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు దోచు పెట్టేందుకు పాలకులు కుట్రలు, కుయుక్తులు పన్నుతున్నారని ఈ విధానాలు సమాజానికి దేశానికి అత్యంత ప్రమాదకరమని అన్నారు. ప్రభుత్వం జనాభా లెక్కల సందర్భంగా కులగణన చేపట్టి అందుకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ బీసీ వర్గాలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయిస్తూ అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదించిందన్నారు. మన రాష్ట్రం లో కూడా జన గణనలో కుల గణన చేపట్టి, కులాల ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ప్రతినిధులు తిరుపతిరావు, లవ కుమార్, భాస్కర్ రావు, వసంత కుమార్, ధర్మారావు, చిన్నారావు, యశోద తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం టౌన్: సామాజిక న్యాయం, ఆత్మ గౌరవం కోసం జనగణనలో కుల గణన చేపట్టాలని సి.పి.ఐ జిల్లా సమితి సభ్యులు టి.తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో రానురాను సామాజిక పరిస్థితులు ఘోరంగా తయారవుతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2026లో జరిగే జనగణనలో భేషరుతుగా కులగనన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దళితులపై, గిరిజనులపై వేలకొలది దాడులు, దౌర్జన్యాలు జరుగుచున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకున్న పాపానలేదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు చిక్కాల గోవిందరావు, బిఎస్పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్.వి. మల్లేశ్వరావు, కె.చిన్నారావులు, కులనిర్మూలన పోరాటం సంఘం కార్యదర్శి ఎస్.వి.జగన్నాధం, సఫాయి కర్మ చారి సంఘం ఏ.కోటేశ్వరరావు, ఎ. ఈశ్వరరావు, ఏ.తిరుపతిరావు, రజక సంఘం జిల్లా నాయకులు కె. సూర్యారావు, గణేష్, ఇతర సంఘాల నుండి అప్పారావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులు విపరీతంగా పెరిగాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొత్స సంతోష్ అన్నారు. మంగళవారం సరుబుజ్జిలి మండల తహాశీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం బొత్స సంతోష్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వాన్ని పాతర వేస్తున్నారని అన్నారు. ఇటీవల భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై సనాతనవాదే దాడికి పాల్పడిన ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. తదనంతరం సర్వే డి.పి గురుగుబెల్లి వెంకట గిరికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు హైమా, సింహాచలం, ధర్మ, కురిని తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల లావాదేవీలు సకాలంలో జరగాలి: కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: సంక్షేమ పథకాలకు సంబంధించిన లావాదేవీలు సకాలంలో జరిగేటట్లు చూడాలని బ్యాంక్ అధికారుల జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. జిల్లా స్థాయి లీడ్ బ్యాంక్ కమిటీ సమావేశంను మంగళవారం నిర్వహించారు. జిల్లాలో వున్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల అధికారులతో వివిధ సంక్షేమ పథకాలు అమలులో బ్యాంకుల ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రధానంగా రైతులకు వ్యవసాయ ఋణం, విద్యార్థుల ఎడ్యుకేషన్ ఋణాలు మంజూరు మరియు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన లావాదేవీలు సకాలంలో జరిగేటట్లు చూడాలని బ్యాంక్ అధికారులతో కలెక్టర్ అన్నారు. మత్స్య శాఖ అధికారులతో మిరైన్ ఫిషర్మెన్లకు లోన్లు, మిల్లర్ల సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఎల్.డి.యం. పి.శ్రీనివాసరావు, రీజనల్ హెడ్. పి.రాజా, వ్యవసాయ శాఖ జె.డి, యస్.సి. కార్పోరేషన్ ఈ.డి, విద్య, వ్యవసాయ, మత్స్య, మెప్మా,డి.ఆర్.డి.ఎ. నాబార్డు తదితర శాఖాధికారులు మరియు జిల్లాలో వున్న అన్ని బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

నేడు 'అన్నదాత సుఖీభవ'-పీఎం కిసాన్ నిధులు జమ

విశాలాంధ్ర-హిర మండలం/పాతపట్నం: అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ నెల 19వ తేదిన రెండో విడత నిధులు జమ చేయనున్న నేపథ్యంలో పాతపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నియోజకవర్గంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాతో కలిపి మొత్తం రూ.7వేలు అందించనున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి అందాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అర్హత ఉన్నవారు ఆన్లైన్లో రైతులు నమోదు చేసుకునే విధానాన్ని సులభతరం చేయాలని అధికారులకు సూచించారు.

నేడు సైలాడలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస మండలంలో సైలాడ రైతు సేవా కేంద్రంలో శాసనసభ్యులు, పియుసి చైర్మన్ కూన రవికుమార్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు తెలిపారు. దళారీ వ్యవస్థను అరికట్టేందుకు రైతు సేవా కేంద్రాల ద్వారా 2025 -26 ఖరీఫ్ సీజన్ ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులంతా పాల్గొని వారి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. అలాగే అన్నదాత సుఖీభవ - పి ఎం కిసాన్ రెండవ విడత నిధులు బుధవారం మంజూరు చేస్తారని తెలిపారు.

మేలు రకం పశువులతోనే అధిక ఆదాయం

విశాలాంధ్ర - కోటబొమ్మాళి: స్వయం సహాయక సంఘ సభ్యులు మేలి రకమైన పశువులు కొనుగోలు చేసి తద్వారా అధిక ఆదాయం సంపాదించి కుటుంబ జీవన ప్రమాణ స్థాయి పెంచుకోవాలని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లోకనాథం అన్నారు. మండల సమైక్య కార్యాలయంలో 517 జీవోపై పశుసంవర్ధక శాఖ సిబ్బంది, వెలుగు సిబ్బందికి మంగళవారం సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పశువులు ఇన్సూరెన్స్ మరియు కొనుగోలులో పాటించవలసిన ప్రమాణాలు గూర్చి అసిస్టెంట్ డైరెక్టర్, వెటర్నరీ డాక్టర్స్ లక్కినేని కిరణ్ కుమార్, డాక్టర్ ప్రజ్ఞ చైతన్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ పశు సంవర్ధక శాఖ లోకనాథం, వెటర్నరీ డాక్టర్స్ కిరణ్, ప్రజ్ఞ చైతన్య, ఏ.పీ.ఎం టి.సూర్యనారాయణ, మండల సమైక్య సెక్రటరీ బి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్య సేవలందాలి - ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్

విశాలాంధ్ర - కొత్తూరు: ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. మంగళవారం ఆయన కొత్తూరు సామాజిక ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులు ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా అనంతరం కొత్తూరు ఎంపీడీవో కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయాలను పీవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు, ఎంపీడీవో, ఇతర ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం చేయరాదు

విశాలాంధ్ర - కవిటి: గ్రామాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేయకూడదని ఎంపీడీవో ఎల్.త్రినాథ్ అన్నారు.ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, పంచాయితీ కార్యదర్శులకు గ్రామాభివృద్ధి, పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశుభ్రత చర్యలు, వ్యర్థ నిర్వహణ, పచ్చదనం పెంపు,ప్రజాభాగస్వామ్యం వంటి అంశాలపై చర్చించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవో వరప్రసాద రావు, ఏవో శ్రీనివాస రెడ్డి, సర్పంచ్లు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

విశాలాంధ్ర-సోంపేట: మండలం పలాసపురం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అందరూ కృషి చేయాలని సర్పంచ్ తడక జోగారావు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మంగళవారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు ఇంటి నుంచి సేకరించే చెత్తను ఆరుబయట పారవేయవద్దని హితవు పలికారు. వీధుల్లోకి వచ్చే చెత్త సేకరణ వాహనంలో చెత్తను వేసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పోలాకి రమణమూర్తి, పంచాయతీ అభివృద్ధి అధికారి ప్రవీణ్, వీఆర్వో చంద్రకళ, గ్రామపెద్దల సనపల శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్లను తొలగించిన అధికారులు

విశాలాంధ్ర-టెక్కలి: విశాలాంధ్ర పత్రికలో మంగళవారం వచ్చిన పోలీసుల నిఘా నేత్రం కళ్ళు మూసుకుందా... అనే కథనంకు స్పందన లభించింది. ఇందిరా గాంధీ కూడలిలో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చుట్టూ ఉన్న అన్ని బ్యానర్లును పంచాయతీ అధికారులు తొలగించారు. మరలా ఆ కూడలిలో బ్యానర్లు కట్టేందుకు అనుమతులు ఇవ్వకుండా చూస్తామని, బ్యానర్లు కట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేశారు.

విశాలాంధ్ర ఎఫెక్ట్

దళితులు, ఆదివాసీలు, మైనార్టీలపై దాడులు ఆపాలి: సీపీఐ

విశాలాంధ్ర - విశాఖ: దళితులు, ఆదివాసీలు, మైనార్టీలపై దాడులను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్ డిమాండ్ చేశారు. సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో జనగణనలో కులగణన జరపాలని, బీసీలకు 42 శాతం రాయితీ కల్పించాలని డిమాండ్ చేస్తూ జగదాంబ జంక్షన్ బస్టాప్ వద్ద మంగళవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ వచ్చిన తర్వాత దళితులు, ఆదివాసీలు, మైనార్టీలపై దాడులు పెరుగాయని విమర్శించారు. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గోద్రా అల్లర్లలో ముస్లిం మైనార్టీలపై ఊచకోతకు గురికావడం మనం కల్లారా చూసామని అన్నారు. బీజేపీ ప్రభుత్వం లౌకిక దేశంగా ఉన్న భారతదేశాన్ని మనువాద భావజాలాలతో ముందుకు తీసుకెళ్లడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తెనాలిలో దళిత మైనార్టీ యువకులను నడిరోడ్డుపై సిఐ తీవ్రంగా చితకబాదారని, మైనర్ బాలికలపై, మహిళాపై జరుగుతున్న అత్యాచారాలపై కూటమి ప్రభుత్వం నేటి వరకు ఎటువంటి చర్య తీసుకోలేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు ఎం.పైడిరాజు, ఎం. మన్మధరావు, సీఎన్.క్షేత్రపాల్ రెడ్డి, ఎన్.నాగభూషణం, ఎంఏ.బేగం, కె.సత్యాంజనేయ, జిల్లా సమితి సభ్యులు పైల ఈశ్వరరావు, ఎ.దేవుడమ్మ, సిహెచ్.కాసుబాబు, జె.అన్వేష్, డి.హెచ్.పి.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్, రాజు, కాసుల్ రెడ్డి, ఏ.ఆదినారాయణ, ఏ.రవి, పి.పుష్ప, కే.సత్యనారాయణ, కే.తిరుపతిరావు, జి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి నాణ్యతా పరీక్షలు నిత్యం చేయాలి: జీవీఎంసీ కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో గల అన్ని నీటి సరఫరా పంపింగ్ స్టేషన్ల నిర్వహణను మెరుగుపరచాలని, ప్రజలకు నిత్యం అందిస్తున్న తాగునీటి సరఫరాలో నీటి నాణ్యతా పరీక్షలు పంపింగ్ స్టేషన్లలో నిత్యం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ నీటి సరఫరా ఇంజనీర్లకు కమిషనర్ ఆదేశించారు. మంగళవారం ఆయన జోన్ - 6 గాజువాక సుందరయ్య కాలనీలో గల 10 ఎమ్.జి.డి .కెపాసిటీ పంపింగ్ స్టేషన్‌ను జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.వి.వి.సత్య నారాయణ రాజు, జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రిలతో కలిసి పరిశీలించారు. ఈ పరిశీలనలో కమిషనర్ ముందుగా పంపింగ్ స్టేషన్ అంతా కలియతిరిగి పరిశీలించారు. ప్రజలకు నిత్యం అందించే నీటి సరఫరాకు సంబంధించి అన్ని పంపింగ్ స్టేషన్లలో నీటి నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తూ నీటి నాణ్యతా ప్రమాణాలను నిత్యం పాటించేలా చర్యలు ఇంజనీర్లు చేపట్టాలన్నారు. నిత్యం శాంపిల్స్ జరపాలని, ల్యాబ్‌లకు పంపించాలని సంబంధిత రికార్డులో ఆయా వివరాలను నమోదు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కాడ స్టేషన్ నిర్వాహక ఏజెన్సీ ప్రతినిధి రమేష్, కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాస్, సహాయక వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్, వార్డ్ ఎమినిటీస్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

నేలతేరు కేజీబీవీని గంటా సందర్శన

విశాలాంధ్ర - ఆనందపురం: నేలతేరు కేజీబీవీని దత్తత తీసుకున్న బోసు బాబును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు. ఆనంద పురం మండలం నేలతేరు గ్రామంలో ఉన్న కేజీబీవీ పాఠశాలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళ వారం కేజీబీవీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినిలకు అందిస్తున్న భోజనం నాణ్యత కొన్ని విషయాలు గురించి ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన పదార్థాలతో భోజనం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్‌లో తరగతి గదులు, డైనింగ్ హాల్ ఇతర సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్థానిక నాయకుడు శ్రీ మహాలక్ష్మి కల్చర్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ స్వచ్ఛందంగా హైస్కూల్‌కు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలను కల్పిస్తున్నారన్నారు.

అల్లూరి సత్యనారాయణరాజు జీవిత చరిత్ర ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ: అల్లూరి సత్యనారాయణ రాజు జాతీయ ఉద్యమ నాయకుడని ప్రముఖ సాహితీవేత్త డీవీ సూర్యారావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం నిర్వహణలో పౌర గ్రంథాలయంలో రచయితల అంత రంగం ఆవిష్కరణ, ప్రసంగ కార్యక్రమం జరిగింది. సభకు అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించారు. ముందుగా ఎస్డీవీ అజీజ్ రచించిన అల్లూరి సత్యనారాయణ రాజు జీవిత చరిత్ర నవలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాజకీయాల్లో ఆ రోజుల్లో అల్లూరి సత్యనారాయణ రాజు ప్రముఖ పాత్ర వహించారని చెప్పారు. కవి రెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ తనపై వంగపండు ప్రసాద్ ప్రభావం ఉందని, తాను రచించిన జానపద గేయాలను ఆలపించారు. కథా రచయిత ఎస్. హనుమంతరావు మాట్లాడుతూ తన కథా సాహిత్యాన్ని, బాల సాహిత్యంపై తన కృషిని వివరించారు. నవలా రచయిత్రి పెబ్బిలి హైమావతి మాట్లాడుతూ తాను రచించిన నవలల ఇతి వృత్తాలను వివరించి, కుటుంబ, మానవ సంబంధాల విషయంలో సమాజంలో నవలా రచయితలు చైతన్యం కలిగించాలని చెప్పారు. నాటక రచయిత బీవీ అప్పారావు మాట్లాడుతూ విశాఖ నాటక రంగ చరిత్రను వివరిస్తూ నాటక సాహిత్యంలో తన కృషిని వ్యక్తం చేశారు. బసు పోతన స్వాగతం పలికారు.

సింహాద్రి నాధుని దర్శించుకున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

విశాలాంధ్ర- సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారిని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీను, ప్రొడ్యూసర్ ఆచంట గోపి పరుచూరి తదితరులు దర్శించుకున్నారు. వీరికి డి.ఈ.ఓ రాధ ఆలయ సహాయ కార్యనిర్వ హణాధికారి తిరుమలేశ్వరరావు పూల మాలలు వేసి ఘన స్వాగతం పలికారు. అర్చక స్వాములు,వేద మంత్రాల నడుమ పూర్ణ కుంభంతో ఆహ్వానం పలికారు. తొలుత వీరు కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని స్వామివారికి తమ తమ గోత్ర నామాలతో సంకల్పం చెప్పించారు. పిదప వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ శ్రీ సన్యాసినాయుడు, ట్రాఫిక్ సీఐ శ్రీ సురేష్, ఎస్సై శ్రీ అప్పలనాయుడు తదితరులు భద్రతా పర్యవేక్షణలో పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నసాముక్త భారత్ అభియాన్

విశాలాంధ్ర - తగరపువలస: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నసాముక్త భారత్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీవాణి మాట్లాడుతూ యువత నేడు మత్తుపదార్థాల వాడటానికి బానిసై తమ అమూల్యమైన జీవితాన్ని భవితను కోల్పోతున్నారని ఈ మత్తు పదార్థాలకు గంజాయి ధూమపానం మద్యం సేవించడం వంటివి మానుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కొండపేట పరిసర ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి.స్వర్ణలత, బి.సీతనాయుడు, ఏ.విజయలక్ష్మి, డాక్టర్ బి.సుదంక్ష ప్రభాకర్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - భీమిలి: సోషల్ జస్టిస్ అండ్ నల్సా వారి ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీస్ అథారిటీ వారు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ వారి ఆధ్వర్యంలో భీమునిపట్నం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ప్రాంగణంలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ నిర్వహణ, సంక్షేమ చట్టం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ జూనియర్ సౌజన్య మాట్లాడుతూ తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం, 2007 అనేది తల్లిదండ్రులు, వృద్ధులకు సంరక్షణ, సంక్షేమాన్ని అందించడానికి రూపొందించబడిన చట్టమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ పార్వతీశం , న్యాయవాదులు డి కనకమహాలక్ష్మి , పి వెంకటేశ్వరరావు ,ఎం చిన్నాయిపాత్రుడు, బాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు వినియోగంపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - పెందుర్తి : మత్తు పదార్థాలు వినియోగం తద్వారా కలుగు నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పెందుర్తి మండలం పినగాడిలో సీడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలి నిర్వహించారు. నసా ముక్తభారత్ అభియాన్ పేరుతో సీడ్ ఆర్గనైజేషన్ కౌన్సిలర్ కాళీ ఆధ్వర్యంలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మత్తుపదార్థాలు వినియోగం ద్వారా కలుగు నష్టాలను ప్రజలకు వివరించారు. మత్తు ద్వారా సమాజంలో అనేక కుటుంబాలు చిన్నాబిన్నమవుతున్నాయని సమస్యను గుర్తించి బాధితులు చైతన్యవంతం కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

బాధితునికి సి.ఎం.ఎం ఉద్యోగుల బాసట

విశాలాంధ్ర - గాజువాక : విశాఖ స్టీల్ ప్లాంట్ సి.ఎం.ఎం విభాగంలో కాంట్రాక్ట్ (స్వీపర్) కార్మికునిగా విధులు నిర్వహిస్తున్న కె.నారాయణ విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో జరిగిన ప్రమాదం లో తీవ్రంగా గాయమైన కాలును ఆపరేషన్ ద్వారా తొలగించిన దృష్ట్యా నారాయణ కుటుంబం ఇబ్బందుల్లో పడింది. నారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలని సి.ఎం. ఎం అధికారులు , ఉద్యోగులు బాసటగా నిలిచి రూ. 1, 00, 251 / విరాళాలు సేకరించి నారాయణ కుటుంబానికి అందజేశారు. బాధిత కుటుంబానికి సి.ఎం.ఎం ఉద్యోగులు చూపిన చొరవ అభినందనీయం . నారాయణ కుటుంబానికి సాయం చేసిన అధికారులకు ,ఉద్యోగులకు సి.ఎం.ఎం విభాగం ప్రతినిధులు అభినందించారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కలెక్టర్, సీపీ, ఏయూ వీసీ పిలుపు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సమాజాన్ని అస్తవ్యస్తంగా మార్చే.. కుటుంబాలను ఆర్థికంగా ఛిన్నాభిన్నం చేసే మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని, బంగారు భవిష్యత్తు వైపు అడుగులేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ యువతకు పిలుపునిచ్చారు. మాదక ద్రవ్య రహిత సమాజ స్థాపన లక్ష్యంగా కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన నషా ముక్త అభియాన్ కార్యక్రమానికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ మంగళవారం అమృత్ సర్ నుంచి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి దేశంలోని వివిధ రాష్ట్రాల యువతనుద్దేశించి మాట్లాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. దీనికి అనుబంధంగా ఏయూలోని ఎంవీఎస్ మూర్తి ఆడిటోరియంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎన్.సి.బి. జోనల్ డైరెక్టర్ పంకజ్ కుమార్ ద్వివేది, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత, ఐసీడీఎస్ పీడీ రామలక్ష్మి, యువత భాగస్వామ్యమయ్యారు. విశాఖపట్టణాన్ని మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చుదిద్దే మహా యజ్ఞంలో అందరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

విశాలాంధ్ర
పేజి 2
విశాఖపట్నం
బుధవారం 19, నవంబర్ 2025

బెటర్ ట్రాఫిక్...బెటర్ వైజాగ్: సీపీ

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: మారుతున్న కాలానికి అనుగుణంగా నగరాల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోతోందని, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను నియంత్రించడంలో పోలీసులకు రోజురోజుకూ సవాళ్లు పెరుగుతున్నాయని, ఈ పరిస్థితుల్లో పౌర వాలంటీర్ల సహకారం ట్రాఫిక్ నిర్వహణకు ఎంతగానో దోహదపడుతుందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. విశాఖపట్నం నగర భద్రతా మండలి కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది సంఖ్య పెరిగిన వాహనాల సంఖ్యకు అనుగుణంగా లేకపోవడం, ఒకే సమయంలో అనేక కూడళ్లలో ట్రాఫిక్‌ను నిర్వహించడం పోలీసులకు కష్టమవుతోందని, ముఖ్యంగా రామా టాకీస్ లాంటి రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, పాఠశాలల వద్ద, మార్కెట్ ప్రాంతాల్లో, పండుగ సమయాల్లో వాలంటీర్లు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందన్నారు.

అయ్యప్పస్వామి సేవాపీఠాన్ని సందర్శించిన గాదె

విశాలాంధ్ర - తగరపువలస: భీమునిపట్నం మండలం లక్ష్మీపురం అయ్యప్పస్వామి సేవాపీఠంలో నిర్వహిస్తున్న మహా నారాయణసేవ నిత్యాన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో మంగళవారం ఉదయం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు. అయ్యప్పస్వామి సేవాపీఠం ధర్మకర్త గాదు తాతినాయుడు మంగళ వాయిద్యాలతో మేళ తాళాలతో స్వాగతం పలుకుతూ ఆహ్వానించారు. తదుపరి ఎమ్మెల్సీ శ్రీనివాస నాయుడు అయ్యప్పస్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురుస్వామి గాదు తాతినాయుడు ఎమ్మెల్సీ శ్రీనివాస నాయుడుని సాలువా సత్కరించి పూలమాలతో,వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి సేవాపీఠం ధర్మకర్త గురుస్వాములు గాదు తాతి నాయుడు, కంటుబుక్క వెంకన్న, కంటుబుక్క అప్పలనారాయణ, కనకల అప్పలరాజు, కంటుబుక్క శ్రీను, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పొట్నూరు మురళీమోహనరావు, కనకల సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

2 కోట్ల షాపర్స్‌కు చేరిన అమేజాన్ క్రియేటర్ ప్రోగ్రామ్స్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఈ ఏడాది 2 కోట్లకు పైగా షాపర్స్ కోసం తమ క్రియేటర్ ప్రోగ్రాంస్ క్రియేటర్ ఆధారిత అవిష్కరణను ప్రోత్సహించాయని అమేజాన్ ఇండియా ప్రకటించింది. పండగ సీజన్ కు ముందు 1 లక్ష క్రియేటర్లు నుండి ఈరోజు 1.25 లక్షల క్రియేటర్ల వరకు అమేజాన్ వారి క్రియేటర్ ప్రోగ్రాం కొన్ని నెలల్లోనే 25 శాతం పెరిగాయి, క్రియేటర్ ఆధ్వర్యంలోని బెత్సాహికతలో పెరుగుతున్న మార్కెట్ ప్రదేశం యొక్క బాధ్యతను సూచిస్తోందని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. సుమారు 70 శాతం క్రియేటర్ ఆధ్వర్యంలోని కొనుగోళ్లు ఇప్పుడు కర్నూల్, భువనేశ్వర్, విజయవాడ, డెహ్రాడూన్ వంటి నాన్ మెట్రో నగరాల నుండి వచ్చాయని, అమేజాన్ వారి క్రియేటర్లలో మూడింట రెండు వంతులకు పైగా క్రియేటర్లు 500 నాన్-మెట్రో పిన్ కోడ్స్ నుండి వచ్చారని, ఇది క్రియేటర్ వర్గం, భారతదేశవ్యాప్తంగా ప్రాంతీయ క్రియేటర్ల విస్తరిస్తున్న ప్రభావాన్ని సూచిస్తోందన్నారు.

శంకర్ ఫౌండేషన్ మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర -పెందుర్తి: జివిఎంసి 93వ వార్డు, నాయుడుతోట వద్ద గల శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు, ప్రముఖ బహుళజాతి ఔషధ, బయోటెక్నాలజీ సంస్థ ఫైజర్ సహకారంతో పదవాడలో సమగ్ర ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించినట్లు శంకర్ ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కే. బంగార్రాజు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఫైజర్ సీనియర్ అధికారుల సమక్షంలో, ఫైజర్ యూనిట్ అధిపతి బి.మురళీధర్ శర్మ లాంఛనంగా ప్రారంభించగా, శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె. రాధాకృష్ణన్, డిజిఎం(పేషెంట్ కేర్) వి. రమేష్ కుమార్ పాల్గొన్నట్లు తెలియచేశారు. ఈ శిబిరానికి సమీప గ్రామాల నుండి భారీ స్పందన లభించిందని, సుమారుగా 500 మందికి పైగా రోగులను పరీక్షించి 350 మందికి కళ్లద్దాలు మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ప్రధాన ఆసుపత్రిలో కంటి శస్త్రచికిత్సల కోసం 40 మంది రోగులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ కంటి వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఫైజర్ సంస్థ తరుపున రవి చంద్ర కె. (క్వాలిటీ హెడ్), విజయ్ మహాజన్ (ప్రొడక్షన్ హెడ్), రాజేష్ రావూరి (ఫైనాన్స్ హెడ్), అరవింద్ జయరామన్ (ఈహెచ్ఎస్ హెడ్), పి. రమేష్ (బిజినెస్ ఎక్సలెన్స్ హెడ్), సత్బీర్ సింగ్ (టెక్నాలజీ హెడ్), డాక్టర్ ఈశ్వరరావు, ఎం.వి. రామారావు (పబ్లిక్ అఫైర్స్) పాల్గొన్నారని, శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ (శ్రీలక్ష్మి, డాక్టర్ అపూర్వ, డాక్టర్ పవన్ - రోగులకు అవసరమైన కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు అందచేశారని బంగార్రాజు వెల్లడించారు. ఈ శిబిరానికి క్యాంప్ సీనియర్ మేనేజర్ ఎస్. అప్పల రాజు నేతృత్వం వహించారని చెప్పారు.

సిఐఐ సదస్సుపై జగన్ అండ్ కో దుష్ప్రచారం

-జిల్లా టిడిపి అధ్యక్షులు గండి బాబ్జి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నగరంలో జరిగిన సి ఐ ఐ భాగస్వామ్య సదస్సు పై జగన్ అండ్ కో దుష్ప్రచారాలు చేస్తున్నారని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి అన్నారు. మంగళవారం జిల్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సులో 613 ఒప్పందాలు జరిగాయని వాటితో రాష్ట్రానికి 14 లక్షల కోట్లు పెట్టుబడులు, 14 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు.

అందులో వంద సంస్థలు విశాఖ చుట్టూ వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రపంచం మొత్తం ఇప్పుడు ఏపి వైపు చూస్తోందన్నారు. గూగుల్ కి ఎక్కువ నీళ్లు, విద్యుత్ ఖర్చు అవుతుందని జగన్ ముందు చెప్పుకొచ్చారని, మరుసటి రోజు ఆ గూగుల్ తెచ్చింది తామే అని చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఏదేదో మాట్లాడుతున్నారు అసలు వైసిపి హయాంలో ఎన్ని పరిశ్రమలు తెచ్చారు వచ్చాయో చెప్పాలి అని డిమాండ్ చేశారు. కొమ్మాది నుంచి భోగాపురం వరకు ఎలివేటెడ్ కారిడార్ వస్తోంది మెట్రో , రోడ్ ట్రాన్స్ పోర్ట్ సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్నారు అని తెలిపారు. సమావేశంలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు అప్పగిడ్డ అప్పలనాయుడు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పెదగంట్యాడ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ అధికారి రమణ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు న్యూ పోర్టు ఎస్ఐ కె.శ్యామ్ సుందర్, ఎం.వి .రమణ సమక్షంలో క్విజ్ పోటీలు విద్యార్థి విద్యార్థులను నిర్వహించారు.

ట్రినిటీ విద్యానికేతన్, నడుపూరు హై స్కూల్, శరత్ స్కూల్, లైఫ్ వే స్కూల్ విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మాస్టర్స్ డి.వరలక్ష్మి, మనోహర అలీ, గ్రంథాలయ పాఠకులు మహేష్, శేఖర్ ,కార్తీక్, నవ్య,జ్యోతి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

శివునికి పంచామృత అభిషేకం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: బహుళ ఏకాదశి సందర్భంగా నెల్లిముక్కు రామాలయం ప్రక్కన గల శ్రీ శ్రీ శ్రీ గోవింద భూసమేత వీర బ్రహ్మేంద్ర శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగాయి పరమేశ్వర ప్రసాదం భక్తులందరు సేవించుట మహ భాగ్యం అని 75వ వార్డ్ కార్పొరేటర్ శ్రీమతి శ్రీ పులి లక్ష్మీబాయి వెంకటరమణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్తలు ముద్దు రి శ్రీ రామ మూర్తి, ద్వారపూడి గురునాథ్, కణితి అప్పలరాజు, ముద్దర్తి ఆ పులరాజు, ద్వారపూడి సత్యముపూడి, హరీశ్, చెల్లూరి సతీష్, ఎం.మణి, ఎం.రాము, సాంబ గోర్స సురేష్ పుట్ట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టి.డి.ఆర్ ప్రక్రియ వేగవంతం చేయండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలో గల అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలో రోడ్డు విస్తరణలో ఆస్తులకు సంబంధించి టిడిఆర్ జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మంగళవారం ఆయన జీవీఎంసీ 5వ జోన్ అక్కయ్యపాలెం ప్రధాన రహదారి 80 అడుగుల రహదారిలో ఉన్న బాబా తాజుద్దీన్ అవులియా ఆశ్రమం (మసీదు) సంబంధించిన టి.డి.ఆర్ జారీకి సంబంధించి స్వయంగా స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్ లో బాబా తాజుద్దీన్ అవులియా ఆశ్రమం(మసీదు) నకు సంబంధించిన ఆస్తి ఎంతవరకు కోల్పోయారు, అందుకు సంబంధించిన పత్రాలు, వారు జీవీఎంసీకి చెల్లించిన ఆస్తి పన్ను వివరాలు అన్ని క్షుణ్ణంగా పరిశీలించి మసీదు ప్రతినిధులతో మాట్లాడుతూ పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. టిడిఆర్ జారీకి సంబంధించి టిడిఆర్ కమిటీకి సమర్పించేందుకు ముందుగా బాబా తాజుద్దీన్ అవులియా ఆశ్రమం(మసీదు)యొక్క అన్ని వివరాలు పత్రాలుతో సమర్పిస్తూ టి.డి.ఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. తదుపరి మసీదు ప్రతినిధులు 80 అడుగుల రోడ్డు లో ఉన్న దుకాణాలను మేము స్వచ్ఛందంగా తొలగించుకున్నామని, కానీ టీడీఆర్ చాలా కాలం నుండి పెండింగ్ లో ఉందని కమిషనర్ కు తెలపగా, టిడిఆర్ ప్రక్రియ వేగవంతం చేసి త్వరలోనే అందిస్తామని వారికి కమిషనర్ తెలిపారు. ఈ పరిశీలనలో జోనల్ కమిషనర్ బి.రాము, డిసిపి రామ్మోహనరావు, ఏసీపీ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆవు మాంసం ఎగుమతి చేసిన నిందితులను శిక్షిస్తాం: ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - ఆనందపురం: అక్రమంగా ఆవు మాంసాన్ని ఎగుమతి చేసిన నిందితులతో పాటు దాని వెనక ఎవరున్నా వదిలిపెట్టేది లేదని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హెచ్చరించారు. శొంఠ్యాం సమీపంలోని దిబ్బడిపాలెం శ్రీమిత్రా మెరైన్ కోల్డ్ స్టోరేజ్ ను మంగళవారం ఆయన సందర్శించారు. కోల్డ్ స్టోరేజ్ లోని కొంత భాగాన్ని లీజుకు తీసుకున్న తెలంగాణకు చెందిన మిష్ ఓవర్సీస్ సంస్థ ఎగుమతి చేస్తున్న మాంసం కంటైనర్ లో ఆవు మాంసం కూడా కలిసి ఉందని తనిఖీల్లో బయటపడిందన్నారు. 189 టన్నుల మాంసం నుండి ఆరు శాంపిల్స్ తీసుకుని పరీక్షకు పంపగా.. 87 టన్నుల ఆవు మాంసంగా గుర్తించారని చెప్పారు. జన్మనిచ్చిన తల్లితో సమానంగా చూసే దేశంలో గోవధను మహాపాపంగా పరిగణిస్తాము.. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన వారి వెనుక ఉన్న అరాచక శక్తుల నిగ్గు తేలుస్తామని తెలియజేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ ఉదంతాన్ని సీరియస్ గా ఉన్నారని.. మిష్ ఓవర్సీస్ సంస్థ యజమానులను ఇప్పటికే అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. కోల్డ్ స్టోరేజ్ లీజుకు ఇచ్చినప్పుడు తమ ప్రాంగణంలో ఏం వ్యవహారాలు జరుగుతున్నాయో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని శ్రీ మిత్రా మెరైన్ కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యానికి సూచించారు. సంఘ విద్రోహ శక్తులు నమ్మలేని పేలుడు పదార్థాలు ఇలా నిల్వ ఉంచితే ఏం చేశారని ప్రశ్నించారు. బాధ్యత ఎమ్మెల్యేతో ఈ కోల్డ్ స్టోరేజ్ యజమానికి కొంత పరిచయం ఉండటంతో.. వారిద్దరూ కలిసి ఉన్న ఫోటోలు వైరల్ చేశారన్నారు. కోల్డ్ స్టోరేజ్ లోపల సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఎసిపి అప్పలరాజు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, శాఖారి శ్రీనివాస్, ఆర్. కృష్ణయ్య, బుజ్జి అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, మహంతి శివాజీ, గంజిరెడ్డి స్వామి నాయుడు, బలిరెడ్డి మల్లికార్జునరావు, ఎర్ర రాజు, కె. శ్రీకాంత్ రాజు, కోరుకొండ మూర్తి,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు హామీ

ఆనందపురం నుంచి సత్తరువు జంక్షన్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. బాధితుల విజ్ఞప్తి మేరకు సత్తరువు జంక్షన్ లో రోడ్డు విస్తరణ ప్రాంతంలో పర్యటించి.. షాపులను దౌర్జన్యంగా తొలగించడం వంటి చర్యలు వద్దని అధికారులను ఆదేశించారు.

డిప్యూటీ సీఎం కార్యాలయం ముట్టడికి సిద్ధంకండి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పదాల రమణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికై డిసెంబర్ నెలలో జరిగే డిప్యూటీ సీఎం కార్యాలయం ముట్టడికి కార్మికులు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పదాల రమణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పౌర గ్రంథాలయం జరిగిన గ్రంథాలయభవన నిర్మాణ కార్మికుల ప్రాంతీయ సదస్సుకు యూనియన్ జిల్లా అధ్యక్షులు కోట సత్తిబాబు అధ్యక్షత వహించగా, ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని పదాల రమణ మాట్లాడారు. ఏ.పీ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చట్టం 1996.ను పటిష్టంగా అమలు చేస్తూ వెల్ఫేర్ బోర్డు ద్వారా పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం హామీని గాలికి వదిలి సమీక్షలు సభలు పేరుతో కాలం గడుపుతూ సమస్యలను మరింత జటిలం చేస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారంగా 16 నెలల కావస్తున్న సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేయాల పెండింగ్ లో ఉన్న 46,000 క్లెయిమ్లు రిలీజ్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోన లక్ష్మణ, సంఘం గౌరవ అధ్యక్షులు కూన కృష్ణారావు, నాయకులు ఎస్.సూర్య నారాయణ, కె.ఈశ్వరరావు,వై. ఎస్.మూర్తి, కె.వినోద్, ఆర్.లక్ష్మీ నారాయణ, శివారెడ్డి, యోగి, దాలిబాబు, అప్పలరాజు, వై.అప్పలనాయుడు అల్లిపిల్లి అప్పారావు, ఏఐటీయూసీ నాయకులు కె.సత్యనారాయణ, మధు రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో 3వ డివిజన్: గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి: ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిలో భీమిలి జోన్ 3వ డివిజన్ ముందువరసలో ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రోద్బలంతో 3వ డివిజన్ అప్పికొండ వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్ వెల్ ను గంటా నూకరాజు చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి సర్కార్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా రాజీపడకుండా పనిపాలన సాగుతుందని అన్నారు. అదేవిధంగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రెండవసారి భీమిలి నుండి గెలిచిన తర్వాత స్థానిక ప్రజలకు అద్భుత భావం పోయిందని అన్నారు. ఎక్కడ గంటా ఉంటే అక్కడ అభివృద్ధికి చిరునామా అనే నానుడికి కేరాఫ్ అడ్రస్ గా గంటా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సంకురుభక్త జోగారావు, అప్పికొండ నూకరాజు, అప్పికొండ నర్సింగరావు, కొక్కిరి అప్పన్న, జగదీశుల మురళి, గూడుపు రాజు, వియ్యపు పోతురాజు, కందుల సుందర్ రావు, కొక్కిరి నూకరాజు, సంజీవ రావు, సూర్యనారాయణ మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీగా కన్నూరు అప్పలనాయుడు నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన లా డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆమోదంతో, లా డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ జారీ చేసిన తాజా జీవో ప్రకారం ప్రముఖ న్యాయవాది కన్నూరు అప్పలనాయుడు విశాఖపట్నం జిల్లా కోర్టులు %ం% సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టులకు గ్రేడ్-1 అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. నియామకంతో పాటు విశాఖపట్నం పరిధిలో ప్రభుత్వ తరపున సివిల్, ఇతర న్యాయపరమైన కేసుల్లో వాదనలు వినిపించే బాధ్యత అప్పలనాయుడికి అప్పగించింది. ప్రభుత్వ ప్రయోజనాలను రక్షించడం, న్యాయపరమైన వ్యవహారాల్లో తగిన చర్యలు చేపట్టడం ఆయన ప్రధాన బాధ్యతలుగా ఉత్తర్వుల్లో పేర్కొంది.

16 ఏళ్ల న్యాయవృత్తి అనుభవం...

అనకాపల్లి జిల్లా కసింకోట మండలం పాత కన్నూరుపాలెం గ్రామానికి చెందిన అప్పలనాయుడు ఆంధ్ర విశ్వవిద్యాలయం (2006-09 బ్యాచ్)లో లా చదువు పూర్తి చేసి, విశాఖపట్నం జిల్లా కోర్టులో తన న్యాయవృత్తిని ప్రారంభించారు. సివిల్, క్రిమినల్, కన్జ్యూమర్, డీఆర్టీ, కమర్షియల్, ఆర్బిట్రేషన్ వంటి విభిన్న రంగాల్లో 16 సంవత్సరాల అనుభవంతో అనేక కేసులను విజయవంతంగా నిర్వహించారు. న్యాయవాదుల వర్గంలో తన వాదనా నైపుణ్యం, న్యాయపరమైన అవగాహన, ప్రజల పట్ల అంకితభావంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. విద్యార్థులలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలో పారా లీగల్ వాలంటీర్ గా పేద ప్రజలకు న్యాయసహాయం అందించడంలో అప్పలనాయుడు ముందువరుసలో నిలిచారు. అప్పలనాయుడు నియామకంపై విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.కె. శ్రీనివాస్, కార్యదర్శి ఎల్.పి. నాయుడు, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్. కృష్ణమోహన్, బార్ కౌన్సిల్ సభ్యులు పి. నర్సింగరావు, కె. రామ జోగేశ్వరరావు, బైపా అరుణ్ కుమార్ ల భాకాంక్షలు తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.ఎస్. నాయుడు, గవర్నమెంట్ ప్లీడర్ బుగత సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు కె.ఎస్.ఎస్. నారాయణ, గొంప సత్యనారాయణ, జి. పార్వతీశ్వరరావు తదితరులు అప్పలనాయుడును ప్రత్యేకంగా అభినందించారు.

తెలుగు భాషా సంస్కృతులను కాపాడడం యువత కర్తవ్యం

విశాలాంధ్ర - మల్కాపురం: తెలుగు భాషా సంస్కృతులను కాపాడడం యువత కర్తవ్యం అని కళా రత్న సుంకర చలపతిరావు అన్నారు. స్థానిక మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం కవి సమ్మేళనాన్ని ఆయన ప్రారంభిస్తూ తెలుగు రాష్ట్రాలలోని యువత తెలుగు రచనలపై దృష్టి పెట్టాలని అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. కుమార్ రాజు మాట్లాడుతూ - కవులకు ఆదరణ కలిగించడం కోసం అన్ని గ్రంథాలయాలలోనూ కవి సమ్మేళనాలను నిర్వహిస్తున్నామని అన్నారు. తెలుగు రచనలను కొనుగోలు చేయడానికి ప్రాధాన్యతనిస్తున్నామని అన్నారు. డాక్టర్ దేవులపల్లి పద్మజ చిట్ ఫండ్ చిత్రాలు అనే కవితను, రావులపల్లి రామలక్ష్మి జయహో తెలుగా అనే కవితను, మనోరంజని జోహర్లు అనే కవితను, శైలజ తెలుగు భాష గొప్పతనం అనే కవితను, వైద్రా ఈశ్వరరావు అమ్మ అనే కవితను, టి. రామ్మూర్తి కొత్త తరం తల్లి అనే కవితను హృద్యంగా పాడారు. కార్యక్రమాన్ని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఐ.పి.ఎస్. భాగ్యలక్ష్మి సమన్వయ పరచగా, వందన సమర్పణను గ్రంథాలయాధికారి వి. అజయ్ కుమార్ నిర్వహించారు.

శ్రీరాముడు బీజేపీ నాయకుడు కాదు: జగన్ మురారి

విశాలాంధ్ర కలెక్టరేట్: బీజేపీ శ్రీరాముడి పేరు వాడుకొని హిందువులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి అనేక అక్రమాలు చేస్తోందని, ఒక సామాన్యుడు, రామభక్తుడు జగన్ మురారి అన్నారు. ఈ సందర్భంగా ఆయన జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శ్రీరాముడి చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. దేశంలో ఉన్న హిందువులు మేలుకోవాల్సిన అవసరం ఉందని, శ్రీరాముడి భక్తులు అన్ని పార్టీలలోనూ, సామాన్య ప్రజల్లోను ఉన్నారని ఆయన అన్నారు. శ్రీరాముడి పేరు మోదీ ,బీజేపీ చెప్పి పేరు తీసుకువస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో తీవ్రవాద దాడులు పెరిగాయని, పుల్వామా సైనికులు, పెహల్గాంలో పర్యాటకులు ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయారన్నారు. ఢిల్లీలో కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్న 2 రోజుల క్రితం కారు బాంబు ఎందుకు జరిగింది, దేశ సంరక్షణలో బీజేపీ ప్రభుత్వం విఫలమయిందని ఆయన అన్నారు. హిందూ మతం మీద మోదీ బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే హిందువుల మీద దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించే చట్టాలు తీసుకురావాలని, హిందువుల మీద దాడి చేయడానికి భయపడతారని, ఆ పని చేస్తే మత విద్వేషాలు ఉండవని, విద్వేషాలు లేకపోతే బీజేపీకి మనుగడ ఉండదని ఆయన అన్నారు. కార్యక్రమంలో భోగవరపు శ్రీనివాస్, గుర్రం కరుణాకర్ పాల్గొన్నారు.

ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్‌లో పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ స్పెషల్ క్యాంపు రెండో రోజు విజయవంతంగా జరిగిందని ప్రిన్సిపల్ ఎస్ ఈ ఫ్లోరా తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదర్శ్ డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.థియోఫిలస్ ప్రారంభించగా, జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, ఆదర్శ్ ఎన్ఎస్ఎస్ పీఓ జి.మంజుల, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, రాజ్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొని మాదకద్రవ్య నిరోధక ప్రతిజ్ఞ చేసారు.

ఈ మెడికల్ క్యాంపులో మెడికవర్ హాస్పిటల్ డాక్టర్లు భాగ్యరాజు, జనరల్ అండ్ కార్డిక్, డాక్టర్ తులసి, జనరల్ అండ్ గైనిక్ కిరణ్ కుమార్, మెడికల్ క్యాంపు ఇన్చార్జ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ టెస్ట్ (సర్వికల్ క్యాన్సర్), ఈసీజీ (2డి ఎకో టెస్ట్), ఆర్బీఎస్ (షుగర్ టెస్ట్), బీపీ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పుష్పగిరి కంటి హాస్పిటల్ వైద్యులు ఎంఎసీఎల్ రాజు, అప్తమాలిక్ డి ఓ ఏ ద్వారా కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో 150 మంది ఉచితంగా వైద్యసేవలందుకున్నారని ప్రిన్సిపల్ ఎస్ఈ ఫ్లోరా తెలియచేసారు. ఈ ప్రత్యేక ఉచిత వైద్య శిబిరానికి రెవ. అన్నారావు మత్సా అన్ని సౌకర్యాలు సమకూర్చి జయప్రదం చేసారని, ఎన్ఏడీ లీలావుట్ కాలనీ పెద్దలు సహకరించారని తెలిపారు.

స్వర్ణ భారతి స్టేడియం పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పునర్నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పునర్నిర్మాణ పనులు జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పివివి సత్యనారాయణ రాజు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పునర్నిర్మాణ పనులు మందకొడిగా సాగడంపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై, గుత్తేదారునిపై ఆగ్రహంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల పర్యవేక్షణ సరిగా చేయడం లేదని అందుకే పనులు ఆలస్యం అవుతున్నాయని ఏపీయుఐఎంఎల్ - వీఎంసి ప్రతినిధి నారాయణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి జీవీఎంసీ స్పోర్ట్స్ విభాగం ఉద్యోగులతో స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియాన్ని క్షుణ్ణంగా కలియతిరిగి ఇంకా పూర్తి కావలసిన పెండింగ్ పనులు ఏమున్నాయో ఒక నివేదికను తయారు చేసి వారం రోజుల్లో అందించాలని డైరెక్టర్ అఫ్ స్పోర్ట్స్ ఐ.వి. రాజును కమిషనర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖ మహా విశాఖ నగరపాలక సంస్థ జీవీఎంసీ 46వ వార్డు పరిధిలో అదిలి సచివాలయం వద్ద శానిటేషన్ కార్మికులకు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జివిఎంసీ ఎన్నో ఏళ్ల నుంచి కుటుంబం కోసం పనిచేస్తూ ప్రజల కోసం, పనిచేస్తున్న జీవీఎంసీ శానిటేషన్ కార్మికులకు సమయందరం రుణపడి ఉండాలన్నారు. ప్రజల కోసం వాళ్ళు

ప్రాణాలు అర్పించి నిరంతరం విధుల్లో కొనసాగుతున్న శానిటేషన్ కార్మికులు, అలానే ప్రజలు కూడా శానిటేషన్ వర్కర్లకు సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కో ఆప్షన్ నెంబర్ సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు బలిరెడ్డి గోవిందరాజు, కె.చిన్నా, ఎన్ కృష్ణ, దూది నరసింగరావు, ఎన్ ఈశ్వరరావు, కోట రామారావు, శానిటేషన్ ఇన్స్పెక్టర్ సత్యం సూపర్వైజర్ రామారావు, వార్డు సిఓ వరలక్ష్మి సచివాలయం శానిటేషన్ సెక్రటరీలు, శ్రీను, కిరణ్ భాను, రేష్మ పాల్గొన్నారు.

సౌదీ బస్సు ప్రమాదంపై షఫీ విచారం

విశాలాంధ్ర - పెందుర్తి: సౌదీ అరేబియాలోని మక్కాలో పవిత్ర స్థలాలను దర్శించుకుని, ప్రార్థనా మందిరాల్లో ప్రార్థనలు చేసి, మదీనాకు బయలుదేరిన హైదరాబాద్ పర్యాటకులు అనుకోకుండా ప్రమాదంలో బస్సు దహనం అత్యంత విచారకరమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీవుల్లా అన్నారు. పెందుర్తిలో ఆయన మాట్లాడుతూ పవిత్ర మక్కా దర్శనంలో ఇలాంటి దుర్ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. హైదరాబాద్ కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన 18 మంది సహా 45 మంది ప్రమాద్యవశాత్ పద్ధారని ఆవేదన వెలిబుచ్చారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పటిష్ట చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు.

మహిళలు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై పురోగతి సాధించాలి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: మహిళలు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై పురోగతి సాధించాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్పర్సన్ డా. రాయపాటి శైలజ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం, ఆంధ్ర యూనివర్సిటీ బాస్కెట్బాల్ కోర్టు ప్రక్కన గల రామినేని కోదండరామయ్య సెమినార్ హాల్లో దుర్గాబాయి దేశ్ ముఖ్ విమెన్ సెంటర్ ఫర్ స్టడీస్ ఆధ్వర్యంలో మహిళల భద్రతను నిలబెట్టడం, విశాఖపట్నం విజయానికి బెంచ్మార్కింగ్ మరియు భవిష్యత్తును నిర్ధారించే అంశాలు పై సెమినార్ నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర మహిళా కమిషన్ డా. రాయపాటి శైలజ మాట్లాడుతూ ఇటీవల నేషనల్ కమిషన్ ఫర్ విమెన్ నిర్వహించిన సర్వే లో 'నారి 2025' విశాఖపట్నం జిల్లాకు సేఫెస్ట్ సిటీ అని ర్యాంకింగ్ రావడం సంతోషదాయకమన్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల జరిగిన సీఐఐ సమిట్ లో చెప్పారన్నారు. ఈ సేఫ్టీ ర్యాంకింగ్ పొజిషన్ ను ఇక్కడితోనే ఈ సంవత్సరానికే వదిలేయకుండా కొనసాగాలంటే ఏం చేయాలనే దానిపై అన్ని యూనివర్సిటీస్ లలో ఉన్న విమెన్ సెంటర్ ఫర్ స్టడీస్ తో సంయుక్తంగా ఎలా చేస్తే మనం దీన్ని కేవలం వైజాగ్ కే కాకుండా ఆంధ్రప్రదేశ్లో ఉన్న అన్ని జిల్లాలలో కూడా వర్తింప చేయాలనే ఒక మిషన్ తో విమెన్ కమిషన్ ఒక ప్రోగ్రాం స్టార్ట్ చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఆడపిల్ల పుట్టిన దగ్గర నుండి వృద్ధాప్యం వచ్చేవరకు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ముందుగా పుట్టిన ప్రతి ఆడపిల్లకు చదువు నేర్పించవలసిన అవసరం ఉందని, ఆరోగ్యంగా బ్రతికితే భవిష్యత్తు హెల్తీగా ఉంటుందని, తద్వారా గర్భిణీ స్త్రీలు మరియు శిశు మరణాలు తగ్గుతాయి అన్నారు. మహిళలకు చట్టపరమైన భద్రత, ఆర్థిక, సామాజిక భద్రతను కల్పించాలన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా శ్రీ శక్తి పథకం, మహిళా సాధికారత సాధించడం జరిగిందన్నారు. మహిళలకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైన వన్ స్టాప్ సెంటర్లో తెలియజేస్తే సమస్య పరిష్కరించే వరకు అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఇతర సంస్థలలో మహిళల భద్రతకై కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ మహిళలు అర్ధరాత్రి ఒంటరిగా తిరగ గలిగే భద్రత ఉన్నప్పుడు అదే మహిళలకు సెక్యూరిటీగా ఉంటుందన్నారు. ప్రజల క్షేమమే పోలీస్ వ్యవస్థకు కళ్ళు చెవులుగా ఉంటాయన్నారు.

త్రికంటి భీమేశ్వర స్వామికి బెహరా ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర–సింహాచలం: గ్రేటర్ విశాఖ 92 వ వార్డు గోపాలపట్నం మెయిన్ రోడ్డు నరసింహ నగర్ లో కాత్యాయని సమేత త్రికంటి భీమేశ్వర స్వామి వారిని దర్శించుకున్న జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కర రావును ప్రధాన అర్చకులు మిర్యాల సుబ్రహ్మణ్య శర్మ ఆహ్వానం పలికారు. ఆలయములో కార్తీక మాసం సందర్భంగా మాస శివరాత్రి రోజున శ్రీ కాత్యాయని సమేత త్రికంటి భీమేశ్వర స్వామి వారికి మహా రుద్రాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ ముందుగా స్వామివారికి బెహరా చేతుల మీదుగా అభిషేకం చేయించి ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కడిమి రామకృష్ణ,బండారు శ్రీనివాసరావు, మార్కండేయ రాజశేఖర్ మరియు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి పరీక్షలు చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: గ్రామాలలో, పాఠశాలలలో, అంగన్వాడీలలో సరఫరా అయ్యే త్రాగునీటి కి పరీక్షలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. ఎన్ .హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిత్యం తాగునీటి పరీక్షలు చేయడంతో పాటు ట్యాంకులు శుభ్రం చేయటం, క్లోరినేషన్ చేయటం తప్పనిసరిగా జరగాలన్నారు. తాగునీటి వనరుల వద్ద మురుగు చేరకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా , బహిరంగ మల విసర్జన జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు .కాచిన నీటిని తాగాలని, ఆహారం తినేముందు,మల విసర్జన తరువాత శుభ్రంగా చేతులు కడుక్కోవాలని ,ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాలన్నారు. భూగర్భ జలాలు పెరిగే విధంగా కమ్యూనిటీ సోక్ పి ట్స్ నిర్మాణం,చెరువు గట్లను పటిష్టం చేయడం, మైనస్ 8 కంటే ఎక్కువ లోతులో భూగర్భ జలాలు ఉన్న ప్రాంతాలను గుర్తించి భూగర్భ జలాలు పెంచే దానికి ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. సంబంధిత అధికారులు అందరినీ సమన్వయం చేసుకొని జల జీవన్ పనులను సక్రమంగా అమలు చేయాలని కలెక్టర్ ఆర్ డబ్ల్యు ఎస్ ఇ రామస్వామి కి సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీ అధికారి శ్రీనివాస్, డ్వామా పిడి పూర్ణిమ దేవి ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జగదీశ్వర్ రావు,డిఆర్డిఏ పీడీ లక్ష్మీపతి ఎపీసీ చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి , ఇరిగేషన్ ఇ ఇ, ఇంజనీర్ లు తదితరులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్లు ఫుల్... టాయిలెట్లు నిల్...

టాయిలెట్ దినోత్సవం సందర్భంగా మూల వెంకట్రావు

విశాలాంధ్ర – పెందుర్తి : సమాజంలో టాయిలెట్ కేవలం అవసరం మాత్రమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు చిహ్నం కూడా అని బిజెపి బీసీ నేత మూల వెంకట్రావు అభిప్రాయపడ్డారు. మంచి ఆరోగ్యం, మానవ' గౌరవానికి ప్రతిక అని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం నవంబర్ 19న టాయిలెట్ దినోత్సవం జరుపుకుంటున్నామని, 2025 సంవత్సరానికి సంబందించి టాయిలెట్ అండ్ జాబ్ క్రియోషన్ గా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. తద్వారా సురక్షితమైన, సులువైన శానిటైజేషన్ వ్యవస్థలు, టాయిలెట్లు మంచి ఉద్యోగ అవకాశాలను సృష్టించవచ్చునన్నారు. మోది 2014లో ప్రారంభించిన స్వచ్ఛ భారత మిషన్ ద్వారా దేశం యొక్క శానిటేషన్ చరిత్రలో ఒక మైలు రాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత దేశంలో కోటి ఇళ్లల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి ఈ మిషన్ దోహదపడుతుందన్నారు. మన రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాలు, అనేక సామాజిక వర్గాల జీవసరళి అపరిశుభ్రత కారణంగా ఆందోళనకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. టాయిలెట్లు, నిర్వహణలో తరుచూ నిర్లక్ష్యం కనిపిస్తుంది. దీని వలన ఆరోగ్యానికి హానికరంగా మారింది. విద్య, కుల, మానసిక ఆరోగ్యం, చదువుపై ఆ ప్రభావం చూపిస్తుంది. మెరుగు పరచడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించడం అత్యవసరం. పరిశుభ్రతను పాఠ్యాంశలో బాగం చేయాలి. ప్రభుత్వమే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, సాధారణ ప్రజలు కూడా బాధ్యత వహించాలి. 21 వ శతాబ్దపు భారతదేశం 120 కోట్ల మందికి ఇంట్లో టాయిలెట్ లేదు. జనాభా లెక్కల ప్రకారం 63, 2% ఇల్లకు ఫోన్ సౌకర్యం ఉంది. ఈ విషయం భారతదేశం యొక్క సంక్లిష్ట వైరుధ్యాన్ని సూచిస్తుంది. జనాభాలో సగం మంది బహిరంగ మల విసర్జన చేస్తుండటం, చేశానికి పెద్ద ఆందోళన కలిగించే అంశం అని పేర్కొన్నారు. సాంస్కృతిక, సాంప్రదాయ కారణాలు, విద్య లేకపోవడం. అపరిమతమైన ఆచారాలు ప్రధాన కారకాలు. ఈ రంగాల్లో మనం చాలా చేయాల్సి ఉంది. మోడీ సంకల్పించిన స్వచ్ఛభారతపై దృష్టి సారించాలి. కేవలం టాయిలెట్లు నిర్మించడమే కాదు వాటి నిర్వహణతో పాటు అందరూ పెద్దగా ఉపయోగించేలా దృష్టిపెట్టాలి. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా మహిళలు, యువత స్వచ్ఛ భారత్ శిబిరంలో పాల్గొనేలా చూడాలని, టెక్నాలజీ ఉపయోగించాలన్నారు. అప్పుడే మోదీ కల ముద్దుబిడ్డ స్వచ్ఛ భారత్" అన్న పదకం సాకారం అవుతుందని మూల వెంకటరావు పేర్కొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి అంబలం పూజ

సీపీ శంఖబ్రత భాగ్చి హాజరు

విశాలాంధ్ర – కొమ్మాది: మధురవాడ ప్రాంతంలో అయ్యప్ప స్వామి వారి భక్తి వాతావరణం నెలకొంది. జీవీఎంసీ జోన్ 2 పీ.ఎం..పాలెం పరిధిలోని 6వ వార్డు వైసీపీ ప్రతినిధి పోతిన ప్రసాద్ (గురు స్వామి) ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అయ్యప్ప స్వామి వారి అంబలం పూజ అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు విశాఖ నగర పోలీస్ కమీషనర్ శంఖబ్రత భాగ్చి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఆయన స్వామి వారి ఆశీస్సులు పొంది, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.?ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ కార్యక్రమంలో పాల్గొని అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంబలం పూజ కార్యక్రమంలో స్థానిక 5,6,7 వార్డుల ముఖ్య నాయకులు, అధిక సంఖ్యలో వార్డు ప్రజలు, భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులందరికీ గురు స్వామి పోతిన ప్రసాద్ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్త్రీల పక్షాన బలమైన కవిత్వం అవసరం

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: నగరానికి చెందిన సమతా సాహితి నెలవారీ సాహిత్య కార్యక్రమంలో భాగంగా నగరంలోని ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం స్త్రీవాద కవితా సంపుటి 'నీలి మేఘాలు' పుస్తకం మీద కవిత్వ పరిచయ సభ ఏర్పాటు చేసింది. కార్యక్రమానికి డాక్టర్ మాటూరి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. స్త్రీల పక్షాన ఇపుడు మరింత బలమైన కవిత్వం రావాలన్నారు. నీలు మేఘాలు' కవిత్వం మీద మహిళా చేతన అధ్యక్షురాలు కత్తి పద్మ ప్రధాన ఉపన్యాసం చేస్తూ స్త్రీల అస్థిత్వానికి సంబంధించిన స్వీయ గౌరవానికి సంబంధించిన అనే అభ్యుదయకరమైన కవిత్వం ఈ కవితా సంపుటిలో ఉందన్నారు. . సామాజిక ఉద్యమ కార్యకర్త న్యాయవాది జహా ఆరా స్త్రీల దోపిడీనీ, శ్రమను ఈ కవితా సంపుటిలో కళ్ళకు కట్టినట్టు ఉందని అభిప్రాయపడ్డారు. కొరమాటి చిన్నారావు, డా. ప్రతాప్, పలువురు కవులూ రచయితలూ ఈ సభలో పాల్గొన్నారు.